10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

తెలంగాణ రౌండప్


బుధవారం 8 జనవరి 2025 పేజీలు 8

# తెలంగాణ హైకోర్టు సీజే బదిలీకి సుప్రీంకోర్టు కొలిజీయం సిఫారసు

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ, బాంబే హై కోర్టు చీఫ్ జస్టిస్ లను బదిలీ చేసేందుకు సుప్రీం కోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసు చేసింది. తెలంగాణ హైకోర్ట్ చీఫ్ జస్టిస్ గా ఉన్న జస్టిస్ అలోక్ అరాదేను బాంబే హైకోర్టుకు.. బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్ గా

- మిగతా 2లో...







# రేవంత్ రెడ్డి క్షమాపణలు చెప్పాలి

## దాడి ఘటనపై కిషన్ రెడ్డి, రాజాసింగ్ ఆగ్రహం

- బీజేపీ కార్యాలయంపై దాడిని ఖండించిన కిషన్ రెడ్డి, రాజాసింగ్
- బీజేపీ తలుచుకుంటే కాంగ్రెస్ కార్యకర్తలు రోడ్డు మీద తిరగలేరని హెచ్చరిక
- పోలీసులను వెంట తీసుకొచ్చి మరీ రాళ్లు విసిరారని ఆగ్రహం





హైదరాబాద్ పెన్ పవర్:బీజేపీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ దాడి నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. యూత్ కాంగ్రెస్ నేతలు బీజేపీ కార్యాలయంపై దాడి చేయడాన్ని కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. బీజేపీ తలుచుకుంటే కాంగ్రెస్ కార్యకర్తలు రోడ్డు మీద తిరగలేరని హెచ్చరించారు.పోలీసులను వెంట తీసుకొచ్చి మరీ బీజేపీ కార్యాలయంపై రాళ్లు విసిరారని, పోలీసుల తీరు ఇలా ఉంటే ఎలా? అని ప్రశ్నించారు. ఇలాంటి దుర్మార్గాలకు కేరాఫ్ అడ్రస్‌గా కాంగ్రెస్ మారిందని కిషన్ రెడ్డి విమర్శించారు. ప్రజాస్వామ్యంలో హింస, భౌతిక దాడులకు తావులేదన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఉన్నాయా? అని రాజాసింగ్ ప్రశ్నించారు.

# ఫార్ములా ఈ రేసింగ్ కేసు..
# గ్రీన్ కో ఆఫీసులో ఏసీబీ సోదాలు

- మాదాపూర్ తో పాటు ఏపీలోని మచిలీపట్నంలోనూ తనిఖీలు
- గ్రీన్ కో కంపెనీతో నాటి బీఆర్ఎస్ సర్కారు ఫార్ములా ఈ రేసు ఒప్పందం
- అంతకు ముందే బీఆర్ఎస్ పార్టీకి నిధులు సమకూర్చిన గ్రీన్ కో కంపెనీ




-2లో

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణలో ఫార్ములా ఈ రేసు నిర్వహణకు సంబంధించి నాటి బీఆర్ఎస్ సర్కారు గ్రీన్ కో కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. అయితే, ఈ ఒప్పందానికి ముందు ఎలక్టోరల్ బాండ్ ల రూపంలో గ్రీన్ కో అనుబంధ సంస్థలు బీఆర్ఎస్ పార్టీకి పెద్ద మొత్తంలో విరాళాలు అందించాయి. ఇది క్విడ్ కో ప్రో అని అధికార కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంది. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో అవినీతి జరిగిందని ఏసీబీ కేసు కూడా నమోదు చేసింది.ఈ కేసు దర్యాప్తులో భాగంగా మంగళవారం ఉదయం ఏసీబీ అధికారులు గ్రీన్ కో కంపెనీ ఆఫీసుపై రైడ్ చేశారు. హైదరాబాద్ మాదాపూర్ లోని గ్రీన్ కో ఆఫీసుతో పాటు ఏపీలోని మచిలీపట్నంలో ఉన్న అనుబంధ కార్యాలయంపైనా ఏకకాలంలో దాడులు నిర్వహించారు. ఏసీబీ అధికారుల ప్రత్యేక బృందం హైదరాబాద్ నుంచి మచిలీపట్నం చేరుకుని చలమశెట్టి సునీల్‌కు చెందిన ఏస్ అర్బన్ డెవలపర్స్ కార్యాలయంలో సోదాలు నిర్వహిస్తోంది.

## తీహార్ జైలా, లేక చంచల్ గూడ జైలా...
# కేటీఆర్ నిర్ణయించుకోవాలి

- ఫార్ములా ఈ-కార్ రేసింగ్ వ్యవహారంలో కేటీఆర్ పై ఆరోపణలు
- విచారణ జరుపుతున్న ఏసీబీ, ఈడీ
- ప్రజల సొమ్ము దోచుకున్న దొంగ కేటీఆర్ అంటూ ఎంపీ అర్వింద్ విమర్శలు



హైదరాబాద్ పెన్ పవర్:ఫార్ములా ఈ–కార్ రేసింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏసీబీ, ఈడీ విచారణ ఎదుర్కొంటుండడంపై బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పందించారు. కేటీఆర్, కవితకు ఇంకా అహంకారం తగ్గలేదని అన్నారు. ప్రజల సొమ్ము దోచుకున్న దొంగ కేటీఆర్ అని విమర్శించారు. కేసీఆర్ కుటుంబమేమీ చట్టానికి అతీతం కాదని స్పష్టం చేశారు. కేటీఆర్ ఇంకా ఎన్నిసార్లు తప్పించుకుని తిరుగుతారు? అని ప్రశ్నించారు.

-2లో

# రేవంత్ రెడ్డి చేసే అబద్ధపు ప్రచారాలు నిలబడవు

- కేటీఆర్ తెలంగాణ కోసమే పని చేశారన్న జగదీశ్ రెడ్డి
- కేటీఆర్‌పై ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజలు విశ్వసించరని వ్యాఖ్య
- కేటీఆర్ తెలంగాణ, హైదరాబాద్ కోసమే పని చేశారన్న జగదీశ్ రెడ్డి

-2 లో



# రేవంత్ రెడ్డి చేసే అబద్ధపు ప్రచారాలు నిలబడవు

**హైదరాబాద్ పెన్ పవర్:** కేటీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసే అబద్ధపు ప్రచారాలు నిలబడవని, తమ పార్టీ నేతపై ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజలు విశ్వసించరని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... కేటీఆర్ తెలంగాణ కోసమే పని చేశారన్నారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరాలతో పోటీపడేలా తయారుచేసేందుకు, బ్రాండ్ ఇమేజ్ పెంచేందుకు కృషి చేశారన్నారు. ప్రపంచంలోనే అత్యంత నివాసయోగ్యమైన నగరాల్లో హైదరాబాద్‌ను ముందు నిలబెట్టేందుకు కేటీఆర్ ఎంతో కృషి చేశారన్నారు. తమపై కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే బీఆర్ఎస్ మరింత బలపడుతుందన్నారు. కేటీఆర్‌పై కాంగ్రెస్ ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజలు నమ్మరని మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి అన్నారు. న్యాయస్థానం, చట్టాలపై తమకు నమ్మకం ఉందన్నారు. రేవంత్ రెడ్డి కుట్రలను ఛేదించుకొని కేటీఆర్ కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. అక్రమ కేసులతో బీఆర్ఎస్ నేతలను బెదిరించాలని చూస్తే భయపడేది లేదన్నారు. తమ ప్రజా పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు వెంటపడతామన్నారు.

## తెలంగాణ హైకోర్టు సీజే బదిలీకి సుప్రీంకోర్టు కొలిజీయం సిఫారసు

- మొదటి పేజి తరువాయి
ఉన్న దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ్ ను ఢిల్లీ హైకోర్టుకు ట్రాన్స్‌పర్ చేయాలని కొలిజీయం కేంద్రానికి సిఫారసు చేసింది.
తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అలోక్ ఆరాధే 2024 జూలై 23న రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. తెలంగాణ హైకోర్టు ఏర్పాటైన తర్వాత 6 వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అలోక్ బాధ్యతలు చేపట్టారు.

## ఫార్ములా ఈ రేసింగ్ కేసు.. గ్రీన్ కో ఆఫీసులో ఏసీబీ సోదాలు

- మొదటి పేజి తరువాయి
ఉదయం నుంచి మాదాపూర్‌లోని కార్యాలయంలో సోదాలు కొనసాగుతున్నాయని, గ్రీన్‌కో అనుబంధ సంస్థ 'ఏస్ నెక్స్ట్ జెన్' లోనూ తనిఖీలు జరుపుతున్నట్లు ఏసీబీ వర్గాలు తెలిపాయి. 2022 అక్టోబరు 25న ఫార్ములా–ఈ రేస్ నిర్వహణకు సంబంధించి గ్రీన్ కో కంపెనీతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. అంతకుముందే అంటే.. ఏప్రిల్ లో గ్రీన్ కో కంపెనీ, దాని అనుబంధ సంస్థల నుంచి బీఆర్ఎస్ పార్టీకి రూ.31 కోట్లు, ఆ తర్వాత అక్టోబర్ లో రూ.10 కోట్లు విరాళం అందించాయి. ఈ వ్యవహారానికి సంబంధించి ప్రస్తుతం ఏసీబీ దృష్టి సారించింది. తాజాగా నిర్వహిస్తున్న సోదాలు ఇందులో భాగమేనని సమాచారం.

## తీహార్ జైలా, లేక చంచల్ గూడ జైలా... కేటీఆర్ నిర్ణయించుకోవాలి

- మొదటి పేజి తరువాయి
తీహార్ జైలా లేక చంచల్ గూడా జైలా... కేటీఆర్ నిర్ణయించుకోవాలని అర్వింద్ వ్యంగ్యం ప్రదర్శించారు. కేసీఆర్ కుటుంబం ప్రస్తుతం అభద్రతాభావంతో ఉందని వ్యాఖ్యానించారు. అటు, తెలంగాణ బీజేపీ ఆఫీసుపై కాంగ్రెస్ శ్రేణుల దాడిని అర్వింద్ ఖండించారు. గత ప్రభుత్వ సంస్కృతినే కాంగ్రెస్ కూడా అవలంబిస్తోందని మండిపడ్డారు.

# ఆత్మీమ భరోసా సర్వే షురూ...



**నిజామాబాద్, జనవరి 7, పెన్ పవర్:** రైతులు, రైతు కూలీల సంక్షేమం కోసం ప్రభుత్వం వివిధ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోంది. తాజాగా ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా పథకాన్ని ప్రకటించింది. దీన్ని అమలు చేయడానికి వేగంగా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా పంట పొలాల్లో ఉపగ్రహ సర్వే చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు వీలైనంత ఎక్కువ సాయం చేసేందుకు అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో కీలక పథకాలు ప్రకటించి అమలు చేసే దిశగా చర్యలు చేపడుతోంది. తాజాగా.. యాసంగి సీజన్ పంటల సాగు నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. అందులో 500 ఎకరాల్లో సాగు చేసిన పంటలు నమోదు చేస్తారు. ఈ ప్రక్రియ అతి వేగంగా జరగలాని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీన్ని ఈ నెల 6న ప్రారంభించి.. 8వ తేదీలోగా పూర్తి చేయాలని వ్యవసాయశాఖ నుంచి జిల్లాలకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. సర్వే చేస్తున్న సమయంలో ఏవైనా సమస్యలు వస్తే.. ఉన్నతాధికారులను సంప్రదించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు పొలాల బాటపట్టారు. దీనికి సంబంధించిన 10 ముఖ్యమైన అంశాలు ఇలా ఉన్నాయి. ముఖ్యంగా ఇందిరమ్మ ఆత్మీయ రైతుభరోసా పథకం అమలులో భాగంగా.. ఈ సర్వే చేస్తున్నట్లు అధికారుల్లో చర్చ జరుగుతోంది. సాగయ్యే భూములకే పథకాన్ని వర్తింప చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది.. శాటిలైట్ సర్వే ద్వారా.. ప్రత్యేకంగా మండలంలో ఎంపిక చేసిన గ్రామాల్లో మాత్రమే రైతులకు సంబంధించిన వివరాలను నమోదు చేస్తారు.. రైతు పేరు, సర్వే నెంబరు, ఏ పంటలు వేశారు.. ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో పంటలను సాగుచేశారు అనే వివరాలు సేకరిస్తారని అధికారులు చెబుతున్నారు. పంటలు సాగుచేయని భూమి సర్వే నెంబరు, దాని విస్తీర్ణం వంటి వివరాలను కూడా నమోదు చేయాలని.. వ్యవసాయ శాఖ సూచించింది. ఈ సర్వేకు సంబంధించిన యాప్ అందుబాటులోకి వచ్చిన వెంటనే పంటల వివరాలు నమోదు చేసేందుకు.. క్షేత్రస్థాయి ఉద్యోగులు సిద్ధం అవుతున్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకే సర్వే చేస్తామని.. డివిజన్, మండల స్థాయి అధికారులు చెబుతున్నారు.

గత ప్రభుత్వం రైతు బంధు పథకం కింద ఏడాదికి రూ.10 వేలు ఇస్తే.. ఈ ప్రభుత్వం రూ.12 వేలు ఇవ్వాలని నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ ప్రకటించారు. తెలంగాణలోని తండాలు, మారుమూల గ్రామాల్లో ఉన్న భూమి లేని వ్యవసాయ రైతు కుటుంబాలకు.. ఏడాదికి రూ.12 వేలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ పథకానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అని నామకరణం చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారుభూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో ఏడాదికి రూ.12వేలు ఆర్థిక సాయం చేయడం హర్షణీయమని.. రైతు కూలీలు అంటున్నారు. ఎలాంటి ఆంక్షల్లేకుండా పథకాన్ని వర్తింపజేయాలని కోరుతున్నారు.

# నిరసనల మధ్యే రైల్వే లైన్ పనులు



**ఖమ్మం. జనవరి 7, పెన్ పవర్:** మూడో రైల్వే లైన్‌కు సంబంధించి ఖమ్మం రైల్వేస్టేషన్‌తో పాటు ఖమ్మం రైల్వేమార్గంలోని పలు ప్రాంతాల్లో పనులు ఉధృతంగా కొనసాగుతున్నాయి. పనుల నిర్వహణలో ఎలాంటి అవాంతరాలు లేకుండా ఈ మార్గంలో నడిచే దాదాపు 50కి పైగా రైళ్లను సైతం ఈనెల 9 వరకు తాత్కాలికంగా నిలిపేసి, పనులు చేపడుతున్నారు. ఖమ్మంలె చేపట్టిన మూడో రైల్వే లైన్ పనుల్లో అంతరాయం లేకుండా రైల్వే ఉన్నతాధికారులతో పాటు ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్, జిల్లా కలెక్టర్ నిత్యం పర్యవేక్షిస్తున్నారు. రైల్వే లైన్ విస్తరణ కోసం కావాల్సిన భూమిని సేకరిస్తున్నారు. ఇందుకు సంబంధించి మురుగు కాల్వల నిర్మాణం కూడా చేపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న మురుగు కాల్వను కూడా మరింత వెడల్పు చేస్తున్నారు. నగరంలోని స్టేషన్ నుంచి మామిళ్లగూడెం, సారథినగర్, బైపాస్‌రోడ్డు ఏరియా, శ్రీనివాసనగర్ సమీప ప్రాంతాల్లో పనులు నిర్వహిస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. వాహనాలను వేరే మార్గంలో మళ్లిం చినప్పటికీ ఇబ్బంది తప్పడం లేదు. నగరంలోని 36, 37 డివిజన్ల పరిధిలో పనులు నిర్వహిస్తున్నారు. ట్రాక్ విస్తరణ పనులతో పాటు ఇంటర్ లాకింగ్, విద్యుద్దీకరణ, మురుగు కాల్వల నిర్మాణం తదితర పనులు నిర్వహిస్తున్నారు. ట్రాక్ విస్తరణ కోసం భూసేకరణ కార్యక్రమం కూడా జరుగుతోంది. మధిర, ఎర్రుపాలెం, మోటమర్రి తదితర స్టేషన్లలోనూ పను లు జరుగుతున్నాయి. అయితే ఎర్రుపాలెం ప్రాంతంలో పనులు ఇప్పటికే పూర్తి చేశామని అధికారులు చెబుతున్నారు. ఖమ్మం, మధిరలో ఇంకా భూసేకరణ పూర్తి కాలేదు. భూసేకరణ పూర్తయితే మరింత వేగంగా పనులు జరగడానికి అవకాశం ఉంటుందని అంటున్నారు. ఖమ్మం, మధిర పట్టణంలో ఇళ్ల యజమానులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండటంతో కొంత వివాదం నెలకొంది. పలువురు కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. ఇండ్లు కోల్పోయిన వారికి స్థలాలు, పరిహారం విషయంలో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. మూడో లైన్ కోసం దాదాపు 126 ఎకరాల వరకు అవసరం ఉందని అధికారులు తేల్చారు. విలువైన భూము లు కోల్పోతుండడంతో రైతులు పరిహారం విషయంలో ససేమిరా అంటున్నారు. చింతకాని, నాగులవంచ,అనంతసాగర్ తదితర ప్రాంతాల్లో విలువైన భూములను రైతులు కోల్పోతున్నారు. ఖమ్మం నగరంలో నర్తకి థియేటర్, రైల్వే ఓవర్ బ్రిడ్జి కింది ప్రాంతం, సారథినగర్, బుర్హాన్‌పురం తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున ఇళ్లు తొలగించాల్సి ఉంది. మెరుగైన పరిహారం చెల్లించి, భూసేకరణ జరపాలని బాధితులు ఇప్పటికే ప్రభుత్వానికి స్పష్టం చేశారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

# దుండిగల్ గాగిల్లాపూర్‌లో.. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన..

## మొబైల్ మహిళా క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ ప్రారంభించిన మేడ్చల్ జిల్లా డిఎంహెచ్ఓ..



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఓ డాక్టర్ టి.రఘునాథ్ స్వామి..



మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనం..

- మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ టి.రఘునాథ్ స్వామి ఆధ్వర్యంలో..
- గ్రాన్యుల్స్ ఇండియా లిమిటెడ్ సౌజన్యంతో "కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ"(సీఎస్ఆర్)..
- కార్యక్రమానికి హాజరైన గాగిల్లాపూర్ స్థానిక కౌన్సిలర్ అరుణ..
- దుండిగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వర్ణలత, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 7:** రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా చికిత్స విజయవంతంగా మెరుగుపడతుందని, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ టి.రఘునాథ్ స్వామి అన్నారు.. మంగళవారం దుండిగల్ మున్సిపల్ పరిధి గాగిల్లాపూర్ వార్డు కార్యాలయం (పాత గ్రామపంచాయతి) లో, మొబైల్ మహిళా క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్‌ను రఘునాథ్ స్వామి ప్రారంభించారు.. ఈ కార్యక్రమానికి స్థానిక కౌన్సిలర్ అరుణ, దుండిగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వర్ణలత హాజరయ్యారు.. ఈ శిబిరంలో ఉచిత రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.. ఈకార్యక్రమాన్ని గ్రాన్యుల్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ సౌజన్యంతో, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కార్యక్రమం క్రింద, ఏఐజి హాస్పిటల్స్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.. ప్రారంభోత్సవం సభలో డాక్టర్ టి. రఘునాథ్ స్వామి మాట్లాడుతూ, మహిళల్లో అధికంగా కనిపించే రొమ్ము క్యాన్సర్‌ను తొందరగా గుర్తించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. మొబైల్ మహిళా క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ గ్రామీణ, వెనుకబడ్డ ప్రాంతాల్లో మహిళలకు రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం అవసరమైన సదుపాయాలను అందజేస్తుందని చెప్పారు.. ఈ ప్రాజెక్ట్ ప్రారంభ దశలోనే క్యాన్సర్‌ను గుర్తించి, తగిన వైద్యం అందించడం ద్వారా ఆరోగ్య సేవలను మెరుగుపరచడమే లక్ష్యమని తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఈ ఉచిత సేవను ఉపయోగించుకోవాలని సూచించారు.



గ్రాన్యుల్స్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి ఉమా చిగురుపాటి మాట్లాడుతూ, రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా చికిత్స మెరుగుపడి విజయవంతం అవుతుందని అన్నారు.. అలాగే మహిళలు తమ ఆరోగ్యం పట్ల చైతన్యమవ్వాలని సూచించారు..ఏఐజి హాస్పిటల్స్‌లో కన్సల్టెంట్ బ్రెస్ట్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ప్రగ్యా చిగురుపాటి మాట్లాడుతూ, ఈ మొబైల్ యూనిట్ జిల్లా వ్యాప్తంగా అనేక మహిళలకు స్క్రీనింగ్, కన్సల్టేషన్ అందించడానికి సిద్దంగా ఉందని చెప్పారు, రిమోటు ప్రాంతాల్లో కూడా ఈ సౌకర్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు..

ఈ కార్యక్రమానికి దుండిగల్ మున్సిపల్ గగిల్లాపూర్ కౌన్సిలర్ అరుణ, మల్కాజ్‌గిరి డివిజన్ డిప్యూటీ డిస్ట్రిక్ట్ మెడికల్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శోభారాణి, డిస్ట్రిక్ట్ ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ డాక్టర్ సరస్వతి, దుండిగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వర్ణలతతో పాటు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు హాజరయ్యారు..






# రైతును రాజు చేయడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన ఎజెండా






**జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్**



**ఖమ్మం, పెన్ పవర్ జనవరి 7:** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయత పథకాలను ఈ నెల జనవరి 26 వ నుంచి అమలు చేయడానికి శ్రీకారం చుట్టింది. ఆ కార్యక్రమాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సంబరాలు జరపాలని అదేశించడంతో, ఆ అదేశానుశరంగా మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, బాణాసంచా కాల్చి, స్వీట్స్ పంచుతూ, సంబరాలు చేసారు.

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ..

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతుకు న్యాయం జరగాలని ఉద్దేశంతో రైతు రుణమాఫీ,రైతు బీమా, రైతు భరోసాతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుంది అది చూసి ఓర్వలేని బీఆర్ఎస్, బిజెపి కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమం చేస్తుంది అన్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదేళ్లలో రైతుల కోసం 85 వేల కోట్లు ఖర్చు పెడితే కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే 53 వేల కోట్లకు పైగా ఖర్చు చేసిందని అది మరిచి కారు,పువ్వు ఆ రెండు ఒకటే ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులు కుప్పగా మార్చితే దాన్ని సరిదిద్దుకుంటూ కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం అప్పులకు వడ్డీనే 6000 కోట్లు చెల్లిస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి,ఆర్థిక భట్టి విక్రమార్క మల్లు ఒక క్రమబద్ధమైన ప్రణాళిక వేసుకొని రాష్ట్రాన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దుతుంటే ఆ అభివృద్ధిని చూసి తట్టుకోలేని బీఆర్ఎస్ బిజెపి ప్రజలకు తప్పుడు సంకేతాన్ని అందిస్తున్నారు.ఇది మీకు తగదని హెచ్చరించారు.అనంతరం నగర మేయర్ నీరజ,మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలుపరుస్తున్న ప్రజా సంక్షేమ పథకాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించి జిల్లా ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈకార్యక్రమంలో డిప్యూటి మేయర్ ఫాతిమా జోహార ముక్తార్,జిల్లా మహిళా,కిసాన్,ఓబీసీ,సి,మైనారిటీ సెల్,సేవాదళ్ అద్యక్షులు దొబ్బల సౌజన్య, మొక్కా శేఖర్ గౌడ్,పుచ్చకాయల వీరభద్రం, బొడ్డు బొందయ్య,సయ్యద్ ముజాహిద్ హుస్సేన్,సయ్యద్ గౌస్,కార్పొరేటర్లు మలీదు వేంకటేశ్వరరావు, లకావత్ సైదులు నాయక్, మాజి కౌన్సిలర్ పాలకుర్తి నాగేశ్వరరావు,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి వై పాషా, జిల్లా ఓబీసీ సెల్ ఉపాద్యక్షులు బమ్మిడి శ్రీనివాస్ యాదవ్,గజ్జి సూర్యనారాయణ,నగర ఓబీసీ,మైనారిటీ అద్యక్షులు బాణాల లక్ష్మణ్, షేక్ అబ్బాస్ భేగ్, కొంటెముక్కల నాగేశ్వరరావు, కోటేరు నర్సిరెడ్డి, బొజెడ్ల సత్యనారాయణ,గడ్డం వెంకటయ్య,వాసిం,మహమూద్, సంపటం నరసింహరావు,ఏలూరి రవి కుమార్, దొడ్డా ప్రవీణ్, కిలారి అనిల్,జెర్రిపోతుల అంజనీ కుమార్,బచ్చలికూర నాగరాజు,బోయిన వేణు, అభిరామ్,ముజాహిద్దీన్,ఫరీద్ ఖాద్రి,చంద్రం,బెజ్జం గంగాధర్,సురేష్ నాయక్, జాని, బడేమియా,భద్రకాళీ, ప్రతిభారెడ్డి, జ్యోతి,రమాదేవి,లక్ష్మి,భవాని,సమీరా,పర్వత శ్రీను, కొలిపొంగు రమేష్,ఏదునూరి సీతారాములు,కొప్పుల గోవిందరావు, కూరపాటి కిషోర్, కిలారి మనోహర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

# బీజేపీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ దాడి... ఆగ్రహం వ్యక్తం చేసిన టీపీసీసీ

**నిరసనలు ప్రజాస్వామ్య పద్ధతిలో ఉండాలన్న టీపీసీసీ చీఫ్**

**మరో పార్టీ కార్యాలయంపై దాడి సరికాదన్న టీపీసీసీ చీఫ్**

**గాంధీ భవన్‌పై బీజేపీ నేతల దాడి కూడా సరికాదన్న మహేశ్ కుమార్ గౌడ్**



**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ దాడి ఘటనపై తెలంగాణ పీసీసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ బీజేపీ కార్యాలయంపై దాడిని ఖండించారు. నిరసనలు ప్రజాస్వామ్య పద్ధతిలో ఉండాలన్నారు. ప్రియాంక గాంధీపై ఢిల్లీ బీజేపీ నేత వ్యాఖ్యలను ఖండించాల్సిందేనని... కానీ మరో పార్టీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ దాడి మాత్రం సరికాదన్నారు. ఈ మేరకు యూత్ కాంగ్రెస్‌ను హెచ్చరించారు. బీజేపీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ దాడి సరికాదు... అలాగే గాంధీభవన్‌పై బీజేపీ నేతల దాడి కూడా సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో దాడులు చేయడం పద్ధతి కాదన్నారు. నగరంలో శాంతిభద్రతల సమస్య రాకుండా బీజేపీ సహకరించాలని కోరారు.

**నాంపల్లిలో ఉద్రిక్తత**

నాంపల్లిలోని బీజేపీ, కాంగ్రెస్ కార్యాలయాల వద్ద ఈరోజు ఉద్రిక్తత చోటు చేసుకుంది. ప్రియాంకగాంధీపై ఢిల్లీ బీజేపీ నేత అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఈరోజు మధ్యాహ్నం రెండు గంటలకు యూత్ కాంగ్రెస్ నేతలు నాంపల్లిలోని బీజేపీ కార్యాలయం ముట్టడికి వచ్చారు. వారిని బీజేపీ కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ కార్యాలయం పైకి రాళ్లు రువ్వారు. దీంతో బీజేపీ శ్రేణులు కర్రలతో వారిని వెంబడించారు. ఈ ఘటనలో ఓ బీజేపీ కార్యకర్తకు గాయమైంది. ఆ తర్వాత బీజేపీ యువమోర్చా గాంధీ భవన్ ముట్టడికి ప్రయత్నించింది. దీంతో అక్కడ ఉద్రిక్తత తలెత్తింది.

# 'నా మాటలు రాసిపెట్టుకోండి'... కేటీఆర్ ఆసక్తికర ట్వీట్!

- ఫార్ములా ఈ-కారు రేసు కేసులో వేగంగా మారుతున్న పరిణామాలు
- ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా కేటీఆర్ ఆసక్తికర ట్వీట్
- ఎదురుదెబ్బల నుంచి బలంగా పుంజుకుంటామన్న మాజీ మంత్రి
- నేటి అడ్డంకులే రేపటి విజయానికి నాంది అన్న కేటీఆర్



హైదరాబాద్ పెన్ పవర్:ఫార్ములా ఈ-కారు రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కు వరుస ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. హైకోర్టు ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసింది. అలాగే ఈడీ మరోసారి కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16న తమ ఎదుట హాజరు కావాలని నోటీసులు ఇచ్చింది. ఇలా ఈ కేసు వ్యవహారంలో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో తాజాగా కేటీఆర్ ఓ ఆసక్తికర ట్వీట్ చేశారు. "నా మాటలు రాసిపెట్టుకోండి. ఎదురుదెబ్బల నుంచి బలంగా పుంజుకుంటాం. మీ అబద్ధాలు నన్ను అడ్డుకోలేవు. మీ ఆరోపణలు నన్ను తగ్గించలేవు. మీ చర్యలు నా దృష్టిని మరుగుపరచలేవు. మీ కుట్రలు నా నోరు మూయించలేవు. నేటి అడ్డంకులే రేపటి విజయానికి నాంది. సత్యం కాలంతో పాటు ప్రకాశిస్తుంది. నేను మన న్యాయవ్యవస్థను గౌరవిస్తాను. న్యాయం గెలుస్తుందని నా అచంచలమైన నమ్మకం. సత్యం కోసం నా పోరాటం కొనసాగుతుంది. త్వరలో ప్రపంచం కూడా దానికి సాక్ష్యమవ్వనుంది" అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

# రూల్స్ ఫాలో కాకపోతే ఫైన్ కట్టాల్సిందే.. వెహికల్ స్క్రాప్ పాలసీ కొత్త నిబంధనలు ఇవే



హైదరాబాద్ పెన్ పవర్:: పర్యావరణ పరిరక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం వెహికల్ స్క్రాప్ పాలసీ విధానాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. 2025, ఏప్రిల్ 1వ తేదీ నుండి ఈ విధానం అమల్లోకి రానుంది. వెహికల్ స్క్రాప్ పాలసీ విధానం కింద 15 సంవత్సరాలు దాటిన వ్యక్తిగత, ఎనిమిదేళ్లు దాటిన వాణిజ్య వాహనాలను తుక్కుగా పరిగణిస్తారు. అయితే వీటిలో ఫిట్‌నెస్ బాగున్న వెహికల్స్‌కు ఐదేళ్ల పాటు మినహాయింపు ఇస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కానీ ఆ వెహికల్స్ రవాణా శాఖ ఫిట్‌నెస్ టెస్ట్‌లో పాస్ అయితేనే ఈ మినహాయింపు వర్తిస్తుంది. ఫిట్ నెస్ టెస్ట్ లో పాస్ అయితే ఆ వాహనాన్ని మరో ఐదేళ్ల పాటు నడుపుకోవచ్చు.. ఒకవేళ టెస్ట్‌లో ఫెయిల్ అయితే మాత్రం ఇంకా ఆ వాహనాలు తుక్కుకు వెళ్లాల్సిందే. రోజు రోజుకు కాలుష్యం పెరిగిపోతున్న నేపథ్యంలో వెహికల్ స్క్రాప్ పాలసీ విధానాన్ని సీరియస్ గా ఇంప్లిమెంట్ చేయాలని భావిస్తోంది ప్రభుత్వం. ఇందులో భాగంగానే.. రూల్స్ పాటించని వారి కోసం కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు తీసుకువచ్చింది. స్క్రాప్ పాలసీకి విరుద్ధంగా కాల పరిమితి దాటిన వాహనాలను నడిపే వారిపై పర్యావరణ పరిహారం విధించాలని నిర్ణయించింది. మొదట మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం వాహన యాజమానులు తమ వెహికల్ కండీషన్ పరీక్షలు చేయించాలి. ఇందులో వెహికల్ ఫిట్ నెస్ సాధించకపోతే.. వాటిని స్క్రాప్ దుకాణాలకు తరలించాలి. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్క్రాప్ గోడౌన్ లో ఆ వాహనాలను అప్పగించాలి. కాల పరిమితి అయిపోయిన వాహనాలను స్క్రాప్ కు తరలించి కొత్త వాహనాలు కొనుగోలు చేసే వారికి ప్రభుత్వం రాయితీ ఇవ్వనుంది. అలా కాకుండా ఆ వాహనాలు నడిపితే.. వారిపై ఎన్విరాన్మెంట్ ఫైన్ విధిస్తారు. సెంట్రల్ బోర్డ్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఆ వాహనం వల్ల పర్యావరణానికి కలిగిన నష్టానికి సమానంగా జరిమానా విధించనున్నారు. రిజిస్టర్డ్ వెహికల్ స్క్రాపింగ్ ఫెసిలిటీ ప్రకారం స్టేట్ బోర్డు ఈ ఫైన్ విధిస్తోంది. ఫైన్ విధించిన అనంతరం సదరు వ్యక్తి ఒక సంవత్సరంలోపు స్క్రాప్ పాలసీ రూల్స్ ఫాలో అయితే విధించిన జరిమానాలో అతడికి 75 శాతం తిరిగి చెల్లిస్తారు. రెండు సంవత్సరాలలో అయితే 60 శాతం, మూడు సంవత్సరాలలో అయితే 40 శాతం జరిమానా తిరిగి చెల్లిస్తారు. పర్యావరణ పరిహారం కింద సేకరించిన ఈ నష్టపరిహారాన్ని సెంట్రల్ బోర్డ్ లేదా స్టేట్ బోర్డు ప్రత్యేక ఖాతాలో ఉండనుంది. ఈ డబ్బును పర్యావరణాన్ని తిరిగి పునరుద్ధరించడానికి ప్రభుత్వం ఉపయోగిస్తుంది.

# కేటీఆర్ కు మరోసారి నోటీసులు ఇచ్చిన ఈడీ



హైదరాబాద్ పెన్ పవర్:ఫార్ములా ఈ-కార్ రేసు వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. విచారణకు రావాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు ఈడీ మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16న వ్యక్తిగతంగా విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో ఈడీ పేర్కొంది. వాస్తవానికి ఈరోజు (జనవరి 7) విచారణకు హాజరుకావాలంటూ కేటీఆర్ కు ఈడీ ఇటీవల నోటీసులు పంపింది. అయితే తెలంగాణ హైకోర్టు ఈరోజు తీర్పును వెలువరించనున్న నేపథ్యంలో... విచారణకు హాజరు కావడానికి తనకు సమయం ఇవ్వాలని ఈడీని కేటీఆర్ కోరారు. కేటీఆర్ విన్నపం పట్ల స్పందించిన ఈడీ అధికారులు... విచారణకు మరో తేదీని ప్రకటిస్తామని చెప్పారు. మరోవైపు, తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే. కోర్టు తీర్పు వెలువడిన తర్వాత ఏసీబీ, ఈడీలు స్పీడు పెంచాయి.

# కేటీఆర్ ఈ కేసును ఎదుర్కోవాల్సిందే!



హైదరాబాద్ పెన్ పవర్:బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఫార్ములా ఈ-కార్ రేసు వ్యవహారంలో తప్పు చేయనప్పుడు కోర్టుకు కేటీఆర్ ఎందుకు వెళ్లారని ఆయన ప్రశ్నించారు. కేసును కేటీఆర్ ఎదుర్కోవాల్సిందేనని అన్నారు. కేటీఆర్ క్వాష్ పిటిషన్ ను తెలంగాణ హైకోర్టు కొట్టి వేసిందని... కేసు విచారణకు కేటీఆర్ హాజరు కావాలని చెప్పారు. బాన్సువాడలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే భూస్థాపితం అయిందని జూపల్లి అన్నారు. భవిష్యత్తులో కూడా ఆ పార్టీ కోలుకునే పరిస్థితి లేదని చెప్పారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం కలగానే మిగిలిపోతుందని వ్యాఖ్యానించారు.

రైతు భరోసా కింద రైతులకు రూ. 21 వేల కోట్లను చెల్లించామని జూపల్లి తెలిపారు. కేసీఆర్ చేసిన అప్పులకు తమ ప్రభుత్వం ప్రతి నెల రూ. 6,500 కోట్ల వడ్డీ కట్టాల్సి వస్తోందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం కలిగిందని అన్నారు. తెలంగాణకు కాంగ్రెస్ పార్టీ శ్రీరామ రక్ష అని అన్నారు.

# ప్రీ లాంచ్ మోసం : రూ. 70 కోట్లు ముంచిన హైదరాబాద్ క్రితికా ఇన్ ఫ్రా డెవలపర్స్




**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లోని బోడుప్పల్ లో ప్రీ లాంచ్ పేరుతో రియల్ ఎస్టేట్ కంపెనీ భారీ మోసానికి పాల్పడింది. అపార్ట్ మెంట్లో ఫ్లాట్ కట్టిస్తామని 170 మంది బాధితుల నుంచి రూ.70 కోట్ల వరకు వసూలు చేసింది క్రితికా ఇన్ ఫ్రా డెవ్ లపర్స్ సంస్థ. ఒక్కొక్కరి దగ్గర రూ.40 లక్షల నుంచి 60 లక్షల వరకు వసూలు చేసి నాలుగు సంవత్సరాలవుతున్నా .. ఫ్లాట్స్ ఇవ్వడం లేదంటూ బాధితులు ఆందోళనకు దిగారు. తమ డబ్బులు తిరిగివ్వాలని లేకపోతే ఫ్లాట్స్ అయినా కట్టివ్వాలని డిమాండ్ చేశారు. తమకు రిజిస్ట్రేషన్ చేసిన ఫ్లాట్స్ ను ఇతరులకు రిజిస్ట్రేషన్ చేస్తున్నారని ఉప్పల్ సబ్ రిజిస్టర్ ఆఫీస్ ముందు బాధితులు ధర్నాకు దిగారు. సంస్థ సుమారు 70 కోట్ల వరకు మోసం చేసిందని ఆరోపిస్తున్నారు.

బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లోని హేమానగర్లో రెండున్నర ఎకరాల స్థలాన్ని 2020 లో కొనుగోలు చేస్తున్నానని క్రితిక ఇన్ఫ్రా డెవలపర్స్ సీఈఓ శ్రీకాంత్ రూ. 54 కోట్ల వరకు డబ్బులు వసూలు చేశాడు. కానీ శ్రీకాంత్ 2 ఎకరాల స్థలం మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకొని ఆ స్థలాన్ని 140 మందికి రిజిస్ట్రేషన్ చేయించాడు. కానీ ఇంకా 40 మందికి ఎలాంటి రిజిస్ట్రేషన్ చేయలేదు. డబ్బులు కట్టి ఐదు సంవత్సరాలు అవుతున్నా మాకు ఎలాంటి పొజిషన్ ఇవ్వడం లేదు, అపార్ట్మెంట్ కట్టి ఇవ్వడం లేదు. మాకు రిజిస్ట్రేషన్ చేసిన స్థలాన్ని మళ్ళీ మిగతా 40 మందికి రిజిస్ట్రేషన్ చేస్తున్నాడని తెలిసి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ కు వచ్చాం. దీనిపై పోలీసులను ఆశ్రయిస్తే సివిల్ మ్యాటర్ అంటూ దాటవేస్తున్నారు. కాబట్టి ప్రభుత్వం చొరవ చూపి మా డబ్బులు మాకు ఇప్పించాలి లేదా మా అపార్ట్ మెంట్ లో ఫ్లాట్ అయినా ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు బాధితులు.

# నాంపల్లి సెంటర్‌లో కొట్టుకున్న కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు



**హైదరాబాద్ పెన్ పవర్:**బీజేపీ ఆఫీస్ ముందు ఉద్రిక్తత నెలకొంది. బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ తలెత్తింది. బీజేపీ ఆఫీసు ముట్టడికి వచ్చిన యూత్ కాంగ్రెస్ నేతలను బీజేపీ కార్యకర్తలు అడ్డుకోవడం ఘర్షణ చెలరేగింది. బీజేపీ దళిత నేతలు, యూత్ కాంగ్రెస నేతలు ఒకరిపై రాళ్లు విసురుకున్నారు. ఈ ఘర్షణలో బీజేపీ దళిత మోర్చా కార్యకర్తలకు తలకి గాయమైంది.

హైదరాబాద్ బీజేపీ ఆఫీసుపై కాంగ్రెస్ కార్యకర్తల దాడికి అసలు కారణం ఇదే. ఢిల్లీ రోడ్లను ప్రియాంక గాంధీ బుగ్గల్లా మారుస్తాం అంటూ ఢిల్లీ బీజేపీ నేత రమేశ్ బిధూరి కామెంట్స్ చేశారు. దీనిపై ఢిల్లీలోనూ రెండు రోజులుగా మాటల యుద్ధం నడుస్తుంది. బీజేపీ నేత రమేశ్ బిధూరి వ్యాఖ్యలను ఖండిస్తూ.. బీజేపీ ఆఫీసుపై తెలంగాణ కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారు.

# కేటీఆర్ క్వాష్ పిటిషన్ కొట్టివేత... కీలక అంశాలను ప్రస్తావించిన హైకోర్టు



**హైదరాబాద్ పెన్ పవర్:**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు ఆర్డర్ కాపీ సిద్ధమైంది. ఈ ఆర్డర్ కాపీలో జడ్జి లక్ష్మణ్ పలు కీలక అంశాలను ప్రస్తావించారు. హెచ్ఎండీఏ పరిధికి మించి డబ్బులు బదిలీ చేసినట్లు ఆర్డర్ కాపీలో హైకోర్టు పేర్కొంది. కేబినెట్ ఆమోదం లేని లావాదేవీలపై విచారణ జరగాలని కోర్టు అభిప్రాయపడింది. అలాగే ఈ చెల్లింపుతో ఎవరు లబ్ధి పొందారో కూడా తెలియాలని ఆర్డర్ కాపీలో పేర్కొంది.కేటీఆర్ దుర్వినియోగం చేశారని ఆరోపణలు ఉన్నాయని కోర్టు తెలిపింది. అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నట్లు చెప్పింది. నిబంధనలకు విరుద్ధంగా నిధులు బదిలీ చేశారని ఆరోపణలు వచ్చాయని వెల్లడించింది. రాష్ట్ర ఖజానాకు నష్టం చేకూరినట్లు ఆరోపణలు ఉన్నట్లు వెల్లడించింది.ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలకు లబ్ధి చేకూర్చారని ఆరోపణలు ఉన్నట్లు కోర్టు తెలిపింది. ఆరోపణల మేరకు పలు సెక్షన్ల కింద ఏసీబీ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించింది. ఎఫ్ఐఆర్‌ను కొట్టివేసే అధికారాన్ని కోర్టు కొన్ని సందర్భాల్లోనే వాడాల్సి ఉంటుందని కోర్టు పేర్కొంది. దర్యాప్తు అన్యాయంగా ఉంటేనే కోర్టు తన అధికారాన్ని ఉపయోగించాలని వెల్లడించింది. పోలీసుల అధికారాలను హరించాలనుకోవడం లేదని కోర్టు పేర్కొంది. ఏసీబీ చేసిన ఆరోపణలపై తాము విచారణ చేయాలనుకోవడం లేదని వ్యాఖ్యానించింది.

ప్రజాధనానికి మంత్రులు ట్రస్టీలుగా పనిచేయరని కేటీఆర్ తరఫు న్యాయవాది తెలిపారు. అయితే కేటీఆర్ తరఫు న్యాయవాదితో హైకోర్టు విభేదించింది. ప్రజల ఆస్తులకు మంత్రి బాధ్యుడిగా ఉండాలని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా పలు కేసుల్లోని సుప్రీంకోర్టు ఉత్తర్వులను హైకోర్టు ఉదహరించింది. ఉత్తమ పాలన అందించే బాధ్యత మంత్రిపై ఉంటుందని పేర్కొంది.

# కేటీఆర్ కేసులో బిగ్ ట్విస్ట్: సుప్రీంకోర్టులో ముందుగానే పిటిషన్ వేసిన రాష్ట్ర ప్రభుత్వం




**హైదరాబాద్ పెన్ పవర్:** ఫార్ములా ఈ కార్ రేసు కేసు కీలక మలుపు తిరిగింది. సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం కెవియేట్ పిటిషన్ దాఖలు చేసింది. ఫార్ములా ఈ కేసులో ఒకవేళ కేటీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తే తమ వాదనను కూడా వినాలని సుప్రీంకోర్టును రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు గానే ఆశ్రయించింది. ఫార్ములా%-%ఈ కార్ రేసు వ్యవహారంపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ వాదనలతో న్యాయస్థానం ఏకీభవించింది. అరెస్ట్ చేయొద్దంటూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులును కూడా హైకోర్టు ఎత్తివేసింది. ఏసీబీ దర్యాప్తులో తాము జోక్యం చేసుకోలేమని కేటీఆర్ తరఫు న్యాయవాదికి హైకోర్టు స్పష్టం చేసింది. చట్ట ప్రకారం నడుచుకోవాలని సూచించింది. అందరికి 'రూల్ ఆఫ్ లా' వర్తిస్తుందని కేటీఆర్ క్వాష్ పిటిషన్ కొట్టివేసిన సందర్భంగా తెలంగాణ హైకోర్టు గుర్తుచేసింది.అసలు

**కేటీఆర్‌పై నమోదైన కేసు ఏంటంటే..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫార్ములా ఈ రేస్ నిర్వహణ కోసం రూ.55 కోట్లు విదేశీ కంపెనీలకు చెల్లించారు. అయితే అప్పట్లో ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండానే హెచ్ఎండీఏ నిధులను విదేశీ సంస్థలకు మళ్లించారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ సమయంలో మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ ఉన్నారు. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌కు లేఖ రాసింది.

ఏసీబీకి కూడా మున్సిపల్ శాఖ ఫిర్యాదు చేసింది. ఏసీబీ రంగంలోకి దిగి విచారణ జరిపింది. ఫార్ములా ఈ రేస్ కోసం జరిగిన బ్యాంక్ లావాదేవీలపై ఏసీబీ ఆరా తీసింది. హెచ్ఎండీఏ నుంచి ట్రాన్స్‌ఫర్ అయిన నిధులు.. ఏ అకౌంట్స్‌లోకి చేరాయనేది కూడా గుర్తించింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలోనే డబ్బులు ట్రాన్స్‌ఫర్ అయినట్లు తేల్చింది. ఈసీ నుంచి అనుమతులు తీసుకోకుండా నిబంధనలు అతిక్రమించారని తేలింది. 2023 అక్టోబర్ 3, 11వ తేదీల్లో హెచ్ఎండీఏ బోర్డు అకౌంట్ నుంచి రూ.45.71 కోట్లు లండన్‌లోని ఫార్ములా%-%ఈ ఆపరేషన్స్‌కు తరలించారు. ఇందుకు గాను ఆర్బీఐ రూల్స్ పాటించనందున హెచ్ఎండీఏ రూ.8 కోట్లను ఐటీ శాఖకు పెనాల్టీగా చెల్లించాల్సి వచ్చింది. ఫెడరేషన్ ఆఫ్ స్పోర్ట్స్ క్లబ్ ఆఫ్ ఇండియా(ఎఫ్ఐఏ)కు రూ.1.10 కోట్లు చెల్లించారు. ఇలా మొత్తం రూ.54.89 కోట్లు మున్సిపల్ నిధులను అప్పటి మంత్రి కేటీఆర్ దుర్వియోగం చేశారని ఏసీబీ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.

# కారులో పెట్రోల్ పోసుకుని లవర్స్ సజీవ దహనం కేసు.. చింటూ యాదవ్ దొరికాడు..




హైదరాబాద్ పెన్ పవర్:మేడ్చల్ జిల్లా: కారులో పెట్రోల్ పోసుకుని, నిప్పంటించుకుని ప్రేమ జంట ఆత్మహత్య చేసుకున్న కేసులో చింటూ యాదవ్ (అలియాస్ మహేష్) అనే యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రేమ జంటను బ్లాక్ మెయిల్ చేసి, బెదిరింపులకు పాల్పడినట్లు చింటూ యాదవ్ పై ఆరోపణలున్నాయి. చింటూ యాదవ్ (అలియాస్ మహేష్) కొర్రెముల మక్తా ప్రాంతానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం కీసర పోలీసులు అదుపులో చింటూ యాదవ్ ఉన్నాడు. తను ప్రేమించిన అమ్మాయి తరపు బంధువు బ్లాక్ మెయిల్‌చేస్తున్నాడని ప్రేమజంట ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే.

మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ లో సోమవారం సాయంత్రం ఈ విషాద ఘటన జరిగింది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం జమీలపేటకు చెందిన పర్వతం శ్రీరామ్ (25) పోచారం మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లిలో సైకిల్ షాప్ నిర్వహిస్తున్నాడు. శ్రీరామ్, అతని దుకాణం పక్కన ఉండే ఓ బాలిక ఐదేండ్లుగా ప్రేమించుకుంటున్నారు.

వీరి ప్రేమ వ్యవహారం బాలిక దగ్గరి బంధువు చింటూకు తెలిసింది. అడిగినన్ని డబ్బులు ఇవ్వకపోతే ఇద్దరి ప్రేమ విషయం ఇంట్లో చెబుతానని బాలికను చింటూ 15 రోజులుగా బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు. ఈ విషయాన్ని ఆమె శ్రీరామ్ కు చెప్పడంతో చింటూకు శ్రీరామ్ రూ. 1.35 లక్షలు ఇచ్చాడు. మరిన్ని డబ్బులు కావాలని బెదిరిస్తుండడంతో డబ్బు ఇచ్చేందుకు శ్రీరామ్ తీవ్రంగా ప్రయత్నించాడు. ఎక్కడా అప్పు పుట్టకపోవడంతో ఆత్మహత్య చేసుకుందామని ప్రేమికులు నిర్ణయించుకున్నారు. సోమవారంఉదయం 10 గంటలకు శ్రీరామ్.. బోడుప్పల్‌కు చెందిన తన స్నేహితుడు నవీన్ వద్ద కారు తీసుకుని బాలికతో కలిసి వెళ్లాడు. సాయంత్రం ఘనాపూర్ వద్ద ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు సమీపంలో కారులో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు.కారులో మంటలకు తాళలేక శ్రీరామ్ బయటకు వచ్చి పరిగెత్తాడు. ఫుట్‌పాత్‌పై కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డోర్ లాక్ కావడంతో బాలిక బయటకు రాలేక అందులోనే సజీవ దహనమైంది.

అటువైపు వచ్చిన వాహనదారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. చింటూ బ్లాక్‌మెయిల్ చేయడం వల్లే తాము ఆత్మహత్య చేసుకుంటున్నామని శ్రీరామ్ అంతకుముందు సూసైడ్ నోట్ రాసి బాలిక తల్లిదండ్రులకు, అతని అన్న కొడుకు వాట్సాప్ చేశాడు.

# అద్భుతంగా నేర్చుకునేందుకు... హార్వర్డ్ వర్సిటీ టెక్నిక్స్ ఇవే!




హైదరాబాద్ పెన్ పవర్:చదువుకునే వారి నుంచి ఉద్యోగం చేసే వారిదాకా... అందరికీ ఎప్పుడూ కొత్త అంశాలు నేర్చుకోవడం తప్పనిసరి. చదువులో ముందుండాలన్నా, ఉద్యోగంలో, కెరీర్ లో పైకి ఎదగాలన్నా... నిరంతరం నేర్చుకుంటూనే ఉండాలన్నది అందరికీ తెలిసిందే. ఈ క్రమంలో ఐదు రకాల యాక్టివ్ లెర్నింగ్ టెక్నిక్స్ తో ఏదైనా సులువుగా, అద్భుతంగా నేర్చుకోగలమని హార్వర్డ్ విశ్వవిద్యాలయం నిపుణులు చెబుతున్నారు. చిన్న పిల్లలు, విద్యార్థుల నుంచి పెద్ద వయసు వారిదాకా ఎవరైనా ఈ టెక్నిక్స్ పాటిస్తే ప్రయోజనం ఉంటుందని సూచిస్తున్నారు.

**ప్రపంచ ప్రఖ్యాత సంస్థ నుంచి...**

ప్రపంచంలోని అత్యంత ప్రముఖ విద్యా సంస్థల్లో హార్వర్డ్ విశ్వవిద్యాలయం ఒకటి. 1636 అక్టోబర్ లో స్థాపించిన ఈ వర్సిటీకి సంబంధించి ప్రస్తుతం 19 వేల మందికిపైగా ఫ్యాకల్టీ, ఇతర సిబ్బంది, నాలుగు లక్షల మందికిపైగా పూర్వ విద్యార్థులు ఉన్నారంటేనే... దాని గొప్పతనాన్ని అర్థం చేసుకోవచ్చు. అలాంటి హార్వర్డ్ నిపుణులు చెబుతున్న 'యాక్టివ్ లెర్నింగ్ టెక్నిక్స్' ఇవిగో...

**తరచూ మననం చేసుకోవడం...**

మనం నేర్చుకునే ఏ అంశాన్ని అయినా కచ్చితంగా ఒక నిర్ణీత సమయం పెట్టుకుని గుర్తు చేసుకుంటూ ఉండాలి. ఎంత వరకు గుర్తుంది, ఏమేం మర్చిపోతున్నామనేది గమనించాలి. దీనివల్ల ఆయా అంశాలకు సంబంధించిన జ్ఞాపకాలు మన మెదడులో లోతుగా అల్లుకుపోతాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

**మీకు మీరే టెస్టు పెట్టుకోవడం...**

ఏదైనా అంశానికి సంబంధించి నిర్ణీత పాయింట్లపై మీకు మీరే చిన్న చిన్న పరీక్షలు పెట్టుకోవాలి. మామూలుగా ఎవరైనా ఫ్యాకల్టీ ప్రశ్నాపత్రం తయారు చేస్తే ఎలా ఉంటుంది? ఏ ప్రశ్నలు, ఎలా వేస్తారనే ఆలోచన చేసి... అందుకు తగినట్టుగా టెస్టును రూపొందించుకుని దానికి విభిన్నంగా, ప్రాక్టికల్ గా సమాధానాలను ప్రాక్టీస్ చేయాలి.

**ఇతరులకు నేర్పించండి/బోధించండి**

మనం నేర్చుకుంటున్న అంశాలను అదే సమయంలో మరొకరికి నేర్పించడం లేదా బోధించడాన్ని ప్రాక్టీస్ చేయాలి. తోటివారికైనా, స్నేహితులకైనా ఆ అంశం అర్థం అయ్యేలా బోధించేందుకు ప్రయత్నించాలి. ఈ క్రమంలో ఆ అంశాన్ని మరింత సులువుగా గుర్తుంచుకునే టెక్నిక్ మీ మెదడులోనే ఉత్పన్నం అవుతుంది. దీర్ఘకాలిక మెమరీగా స్టోర్ అవుతుంది.

**చెబుతున్నది విని వేగంగా నోట్ చేసుకోవాలి...**

ఎవరైనా ఏదైనా అంశాన్ని చెబుతున్నప్పుడు, బోధిస్తున్నప్పుడు పూర్తి ఏకాగ్రతతో వింటూ, వెంట వెంటనే వేగంగా నోట్ చేసుకునేందుకు ప్రయత్నించాలి. తిరిగి మీరు నోట్స్ ను చూసుకుంటే... సంబంధిత అంశం, బోధించిన తీరు వెంటనే జ్ఞప్తికి రావాలి. ఇది మీలో నేర్చుకునే సామర్థ్యాన్ని పెంపొందిస్తుందని హార్వర్డ్ నిపుణులు చెబుతున్నారు.

**నేర్చుకున్న దానిపై ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి**

మీరు నేర్చుకున్న కొత్త అంశంగానీ, సాంకేతికతను గానీ బయట అప్లై చేయడానికి ప్రయత్నించాలి. ఇతరులకు వివరించి వారి అభిప్రాయం తీసుకోవాలి. ఇంతకన్నా సులువుగా, భిన్నంగా చేయడం ఎలాగనే సూచనలు స్వీకరించాలి. ఈ అభిప్రాయాలు, సూచనలకు అనుగుణంగా మార్పులు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# బీట్ రూట్ తినండి.. బీపీ కంట్రోల్.. చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది.. ఇంకా ఎన్నో..!




హైదరాబాద్ పెన్ పవర్:నేటి కాలంలో హైబీపీ చాలా సాధారణ సమస్యగా మారింది పొద్దున్న లేచింది మొదలు.. రాత్రి పడుకునేంత వరకు జనాలు టెన్షన్ లైఫ్ గడుపుతున్నారు. ఇంట్లో బిజీ.. ఆఫీసులో బిజీ.. ఒక్కోసారి తిండి కూడా తినకుండా తెగ టెన్షన్ పడుతూ పనులు చేస్తుంటారు. ఈ టెన్షన్ హైబీపీకి దారితీస్తుంది. అలాంటి వారికి గుండె జబ్బులు కూడా వచ్చే అవకాశం ఉంది. అందుకే ఒక్కసారి దీని బారిన పడ్డవారు అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఆహార నియమాలు కచ్చితంగా పాటించాలి. సోడియం ఉండే ఆహార పదార్థాల్ని చాలా తక్కువగా తినాలి. పొటాషియం ఉండే పదార్థాలు తింటే మంచిది.బరువును అదుపులో ఉంచుకోవాలి. ప్రతి రోజూ జాగింగ్ లేదా వ్యాయామం చేయడం అలవాటుచేసుకోవాలి. ప్రాసెస్డ్ ఫుడ్, ఆల్కహాల్లకు దూరంగా ఉండాలి. నకిలీ, తక్కువ నాణ్యత కలిగిన నూనెలు వాడకూడదు. ఉప్పు తక్కువగా తీసుకోవాలి. అన్నింటికీ మించి కూరగాయలు, పండ్లు అధికంగా తినాలి. హైబీపీ పేషెంట్లకు ఎక్కువగా మేలు చేసేది మాత్రం బీట్ రూట్. బీట్ రూట్ తో మేలు బీట్ రూట్ లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రక్తపోటును నియంత్రించడంతోపాటు, చెడు కొవ్వును తగ్గిస్తాయి. ఇందులోని విటమిన్ బి, రక్తనాళాలు సక్రమంగా పని చేసేలా చేస్తుంది. తక్కువ క్యాలరీలు కలిగిన బీట్ రూట్ ఎక్కువ శక్తినిస్తుంది.బీట్ రూట్ లో ఉండే నైట్రేట్లు, నైట్రిక్ ఆక్సైడ్ ను ఉత్పత్తి చేస్తాయి. రక్తనాళాల్లో రక్త సరఫరా సక్రమంగా జరిగేందుకు ఈ వాయువు తోడ్పడుతుంది. బీట్ రూట్ ను జ్యూస్ చేసుకుని తాగితేనే మంచి ఫలితం ఉంటుంది. రక్తపోటు ఉన్నవారు రోజూ 200 మిల్లీ లీటర్ల జ్యూస్ తాగాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# కేటీఆర్‌ను కావాలని ఇరికించే ప్రయత్నాలు జరుగుతున్నాయి



హైదరాబాద్ పెన్ పవర్:ఫార్ములా ఈ-కార్ రేసు వ్యవహారంలో రూపాయి అవినీతి కూడా జరగలేదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఈ కేసులో తాము న్యాయపరంగా పోరాడతామ న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కేటీఆర్‌ను ఇరికించే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం పోరాటం చేయాలని కేటీఆర్ తమకు పిలుపునిచ్చారని చెప్పారు. పార్టీ అగ్రనేత పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలను ఉద్ధృతం చేస్తామన్నారు. నిజంగా కేటీఆర్ తప్పు చేసి ఉంటే ఎలాంటి శిక్షకైనా ఆయన సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కేసుకు సంబంధించి త్వరలో సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు.

## ఉగాది నుంచి రేషన్ కార్డులకు సన్నబియ్యం

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో మరో ఎన్నికల హామీ అమలు దిశగా రేవంత్‌రెడ్డి సర్కార్ అడుగులు వేస్తోంది. రేషన్‌కార్డు లబ్ధిదారులందరికీ సన్నబియ?యం అందజేసేందుకు కసరత్తు చేస్తోంది. ఇప్పుడు అందజేస్తున్న దొడ్డు బియ్యం స్థానంలో సన్నబియ్యం అందజేయనున్నారు. దీనివల్ల రాష్ట్ర ఖజానాపై అదనంగా మరో 1500 కోట్ల భారం పడనుంది.తెలంగాణలోని రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు సన్నబియ్యం అందనున్నాయి. పేదలకు రూపాయికే కిలో బియ్యం అందజేస్తున్నా...ప్రజలెవ్వవరూ వాటిని తినడం లేదు. కొందరు కనీసం బియ్యం తీసుకోకుండా రేషన్ దుకాణాల్లోనే ఆ మేరకు డబ్బులు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ప్రభుత్వం అందజేస్తున్న బియ్యం ఏమాత్రం తినడానికి పనికిరావని ప్రజలు చెబుతున్నారు. దీంతో ఆ బియ్యం వివిధ మార్గాల ద్వారా కాకినాడ, చెన్నై పోర్టులకు చేరి అక్కడి నుంచి విదేశాలకు తరలిపోతోంది. దీంతో పేదలకు సన్నబియ్యమే సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం ముందుగానే కసరత్తు ప్రారంభించిన సర్కార్....ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు పెద్దఎత్తున సన్న వడ్లు పండించేలా ప్రోత్సహించింది. క్వింటాకు 500 రూపాయలు బోనస్ ఇవ్వడంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు సైతం ఈసారి సన్న వడ్లు పండించారు.రాష్ట్రంలో మొత్తం 89.60 లక్షల మంది రేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరందరికీ బియ్యం పంపిణీ చేయాలంటే నెలకు 2 లక్షల టన్నుల బియ్యం అవసరమవుతుంది. ఏటా 24 లక్షల టన్నుల సన్న బియ్యం కావాలని అధికారులు అంచనాలు రూపొందించారు. మొత్తం 2.81 కోట్ల మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ 6 కిలోల చొప్పున పంపిణీ చేయనున్నారు. ప్రస్తుతం రేషన్ బియ్యంపై రాష్ట్రప్రభుత్వం 3వేల600 కోట్ల సబ్సిడీ భరిస్తుండగా... సన్నబియ్యంతో పంపిణీతో మరో 1,500 కోట్లు భారం పెరిగే అవకాశం ఉంది. కొత్త రేషన్ కార్డుల కోసం సుమారు 20 లక్షల మంది ఎదురుచూస్తున్నారు. తెలుగు సంవత్సరాది ఉగాది నుంచే పేదలందరికీ రేషన్‌కార్డులపై ఉచితంగానే సన్న బియ్యం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే కొత్త రేషన్ కార్డుల కోసం 20 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా..వారిలో కనీసం 10 లక్షల మందికి కార్డులు ఇవ్వనున్నట్లు సమాచారం. దొడ్డు బియ?యం స్థానంలో సన్న బియ్యం పంపిణీ ద్వారా పేదలు ఉపయోగంతోపాటు వరి ధాన్యం పండించే రైతులనూ ఆదుకోవచ్చని సర్కార్ భావిస్తోంది. అలాగే రేషన్ బియ్యం అక్రమాలను అరికట్టవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.బియ్యం బ్లాక్ మార్కెటింగ్‌కు కళ్లెం వేయవచ్చని అంచనా వేస్తోంది. సన్నబియ్యం సేకరణకు కిలోకు 55 రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. ఇందులో 36 రూపాయలు కేంద్రం భరిస్తుండగా...మిగిలిన నిధులు రాష్ట్ర ప్రభుత్వమే సర్దుబాటు చేయాల్సి ఉంది. సంక్రాంతి కానుకగానే పేదలకు సన్నబియ్యం పంపిణీకి సర్కార్ ఏర్పాట్లు చేయగా....రైతుల నుంచి సేకరించిన సన్న వడ్లు కనీసం రెండు నెలలైనా నిల్వ చేస్తేనే బాగుంటాయని...ఇప్పటికిప్పుడు కొత్త బియ్యం అందజేస్తే ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చే ప్రమాదం ఉందని అధికారులు సీఎంకు సూచించారు. దీంతో ఉగాది నాటికి బియ్యం సిద్ధం చేసి పంపిణీ చేసేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం యోచిస్తోంది

### ఇంటిపై దీపావళి బాంబుల దాడి

**హైదరాబాద్ పెన్ పవర్:** రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామంలో రమేష్ గౌడ్ ఇంటిపై గుర్తుతెలియని దుండగుల దాడికి దిగారు. పది దీపావళి సుతిలి బాంబులు ఇంటిపై వేసారు. భారీ శబ్దం రావడంతో కుటుంబ సభ్యులు ఇంటి నుండి బయటికి పరుగు తీసారు. ఘటనలో ఇల్లు పాక్షికంగా దగ్దం అయింది.

### మార్వాడి ధర్మశాల ఆలయంలో టీపీసీసీ నేతల పూజలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆదిలాబాద్ మార్వాడి ధర్మశాల లోని వెంకటేశ్వర స్వామి టెంపుల్ ని ఏఐసిసి ఇంచార్జ్ దీపా దాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మంగళవారం దర్శించుకున్నారు. , ఏఐసీసీ కార్యదర్శి వేణుగోపాల్, ప్రోటోకాల్ ఇన్ ఛార్జ్ వేణుగోపాల్, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి, అసెంబ్లీ ఇన్ ఛార్జ్ కంది శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి పేరు మరిచిపోయిన యాంకర్... నిప్పులు చెరిగిన ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలుగు మహాసభల్లో యాంకర్ ముఖ్యమంత్రి పేరు మరిచిపోవడంపై కాంగ్రెస్ నేత, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సీఎం పేరు చెప్పకపోవడం వెనుక ఏదో కుట్ర దాగి ఉందని తనకు అనిపిస్తోందన్నారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ... తెలుగు మహాసభలు పెట్టింది ఎవరు? సభలు పెట్టిన వారికి బుద్ధి లేదా? యాంకర్ అనేవాడికి చదువు రాదా? తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎవరో తెలియకుండా యాంకర్ ఎలా అయ్యాడు? అని భగ్గుమన్నారు.మనం చిన్న చిన్న విషయాలు జరిగినప్పుడే కాగితం దగ్గర పెట్టుకొని మాట్లాడతామన్నారు. నేను ఓ ఎంపీగా ఉండి కూడా కాగితం దగ్గర పెట్టుకొని మాట్లాడతున్నానన్నారు. ఓ ముఖ్యమంత్రి కార్యక్రమానికి వచ్చినప్పుడు ఏ ముఖ్యమంత్రి వచ్చారు... ఆయన పేరు ఏమిటో తెలియకుండానే పేరు చదువుతాడా? అని నిలదీశారు. దీని వెనుక కుట్ర ఉన్నట్లుగా ఉందన్నారు.

**ఏం జరిగింది?**

ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముఖ్యమంత్రిని ఆహ్వానిస్తూ ఓ యాంకర్ పేరును తప్పుగా పలికాడు. "మన ప్రియతమ నాయకులు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, గౌరవనీయులు శ్రీ కిరణ్ కుమార్ గారు..." అంటూ యాంకర్ ఆహ్వానం పలికారు. అయితే ఆ తర్వాత ఎవరో చెప్పడంతో తన తప్పును సరిదిద్దుకున్నారు. "క్షమించాలి, మన ప్రియతమ నాయకులు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ రేవంత్ రెడ్డి గారు" అంటూ సరిదిద్దుకున్నారు. సీఎం పేరును మరిచిపోవడంపై చామల కిరణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సంక్రాంతికి స్పెషల్ బస్సుల సంఖ్యను మరింత పెంచిన ఏపీఎస్ఆర్టీసీ

**తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సందడి**

**7,200 స్పెషల్ బస్సులు నడపనున్న ఏపీఎస్ఆర్టీసీ**

**ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి అదనపు చార్జీలు ఉండవని వెల్లడి**

**అడ్వాన్స్ బుకింగ్ సౌకర్యం ఉంటుందని వివరణ**




**హైదరాబాద్ పెన్ పవర్:**సంక్రాంతి సీజన్ వస్తోందంటే తెలుగు రాష్ట్రాల్లో హడావిడి మామూలుగా ఉండదు. ప్రయాణాలు ఊపందుకుంటాయి. ఇటు ఏపీ, అటు తెలంగాణ రాష్ట్రాల ఆర్టీసీలు వేల సంఖ్యలో అదనపు బస్సులు వేసినా, ప్రయాణికుల రద్దీ ఏమాత్రం తగ్గదు. ఈ నేపథ్యంలో, ఏపీఎస్ఆర్టీసీ ఈ సంక్రాంతికి బస్సుల సంఖ్యను మరింత పెంచింది. 7,200 స్పెషల్ బస్సులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. తెలంగాణ, ఇతర పొరుగు రాష్ట్రాలకు పెద్ద సంఖ్యలో స్పెషల్ బస్సులు నడపనున్నారు. సంక్రాంతి స్పెషల్ బస్సులు జనవరి 8 నుంచి 13వ తేదీవరకు అందుబాటులో ఉంటాయని ఏపీఎస్ఆర్టీసీ వెల్లడించింది. హైదరాబాద్ నుంచి ఇతర ప్రాంతాలకు 2,153 బస్సులు, బెంగళూరు నుంచి ఇతర ప్రాంతాలకు 375 బస్సులు, విజయవాడ నుంచి 300 అదనపు బస్సులు నడపనున్నారు. ఇక తిరుగు ప్రయాణానికి ఈ నెల 16 నుంచి 20 వరకు 3,200 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి అదనపు చార్జీలు ఉండవని ఆర్టీసీ స్పష్టం చేసింది. ఒకేసారి రానుపోను టికెట్ బుక్ చేసుకుంటే 10 శాతం రాయితీ లభిస్తుందని వెల్లడించింది. ఈ స్పెషల్ బస్సుల్లో ముందస్తు టికెట్ బుకింగ్ చేసుకునే సౌకర్యం ఉంటుందని తెలిపింది.